క్లుప్తంగా

ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబుకు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరామర్శ



ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్ : మాతృవియోగంతో బాధపడుతున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబును సోమవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మండలంలోని డి.గొందూరు పంచాయతీ సూకురుపుట్టు గ్రామంలో పరామర్శించారు. శతక కొండమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుల్లిబాబు మాతృమూర్తి శతక కొండమ్మ మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నానని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చెప్పారు. బుల్లిబాబుతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శిరీష

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ పంచాయతీ కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శిరీష మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శిబిరంలో 68 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశామన్నారు. కిలగాడ పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, సిబ్బంది లలితమ్మ, నీలవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి సాగుకు సన్నద్ధం

డుంబ్రిగుడ: మండలంలోని గ్రామాల్లో రబి వరి పంటలను విస్తారంగా పండించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. నారుమడులు సిద్ధం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 380 ఎకరాల్లో వరి పండిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

2న బీజేపీ సమావేశం

పెదబయలు: భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం ఫిబ్రవరి 2న అరకులోయలో జరుగుతుందని నాయుడు రామయ్య తెలిపారు. మండలంలోని పార్టీ శ్రేణులంతా సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు.

డ్రాపౌట్ విద్యార్థులను బడికి పంపాలి



మాట్లాడుతున్న ఎంఈవో రామచంద్రరావు, ఎంపీడీవో వెంకటరావు

హుకుంపేట: మండల కేంద్రంలోని సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, గ్రామ వలంటీర్లతో ఎంఈవో రామచంద్రరావు, ఎంపీడీవో వెంకటరావు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రామచంద్రరావు మాట్లాడుతూ గ్రామాల్లో డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి, బడికి పంపించే బాధ్యతను గ్రామ వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తీసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేయాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. ఎంపీడీవో వెంకటరావు, విద్యాశాఖ కో–ఆర్డినేటర్ జయరాజ్, ఈవోపీఆర్డీ పరశురామ్ తదితరులున్నారు.

టెండర్ ప్రక్రియ చేపట్టాలి

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం ప్రవేశం, నిర్వహణపై ఏటా జనవరి నెలలో నిర్వహించే టెండర్ ప్రక్రియను చేపట్టాలని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్ అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గతేడాదిలో నిర్వహించిన టెండర్ ప్రక్రియ ఈ నెలలో ముగిసిందన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా టెండర్ ప్రక్రియ చేయాలన్నారు.

గడప గడపకు సంక్షేమం

- జి.మాడుగుల, అనంతగిరి, దేవీపట్నంలో గడప గడపకు విశేష స్పందన
- గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి



వి.కోడాపల్లిలో స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర



నేలకోట గ్రామస్తులతో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

జి.మాడుగుల: ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని భీరం సచివాలయం పరిధిలో ఆగంపాడు, వనెల్బ, బొడ్డాపుట్టు, తుమ్మెదలనేరోడి, వి.కోడాపల్లి, వెంకన్నపాలెం గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గ్రామస్తుల నుంచి అనూహ్య స్పందన లభించింది. గ్రామస్తులకు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 280 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గడపకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గడప గడపకు కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యలను ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, పాఠశాల భవనానికి మరమ్మతులు, కమ్యూనిటీ హాల్ తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆమె స్పందించి ఆయా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిట్టాపుట్టులో పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును ఆమె పరిశీలించారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, సర్పంచ్ ఎస్.కొండబాబు, ఎంపీటీసీ సభ్యుడు జి.సన్యాసిదొర, మండల సచివాలయ కన్వీనర్ కళ్యాణం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారి మాణిక్యం, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండం నాయుడు, నాయకులు చిన బాబు ఆచారి, రామకృష్ణ, వెంకటరమణ, సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సారథ్యంలో సంక్షేమ పాలన:

అనంతగిరి: గిరి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆప్యాయతల నడుమ సాగుతోంది. మండలంలోని గుమ్మకోట సచివాలయం పరిధిలోని సింగవరం, దొండలవలస గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి పాల్గొన్నారు. వారికి గ్రామస్తులు గిరిజన సంప్రదాయంగా ఘనంగా స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లోని 125 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గిరిజనులు చూపిస్తున్న ఆప్యాయతలు, ప్రేమానురాగాలు మరువలేనివన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరీ, సర్పంచ్ అప్పారావు, సీతయ్య, ఎంపీటీసీలు తొటినాయుడు, అశోక్, మితుల, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యానారాయణ, నాయకులు గంగులు, స్వామి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు:

దేవీపట్నం: పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పూడిపల్లి పంచాయతీలోని గండికోట, నేలకోట, పి.గొందూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో ఎమ్మెల్యే ధనలక్ష్మి ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ మునుపెన్నడూ లేనివిధంగా పార్టీలకతీతంగా అందరికీ తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అమలుచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. గ్రామల్లో పలు సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరిస్తూ, మిగిలిన వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, సర్పంచ్‌లు కె.నర్సయ్యమ్మ, కె.కృష్ణబాబు, కె.లక్ష్మణ్, నాయకులు బాబ్జి, సత్యనారాయణ, మురళీ, గంగాధర్, శివరామకృష్ణ, రాంబాబు, ప్రసాద్, శ్రీనివాస్, భాస్కరరావు, పోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం నిర్మాణానికి స్థలం



కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి: మండలంలోని ఉర్లాకులపాడులో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించినట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర చెప్పారు. ఆయన గ్రామంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.5లక్షలతో సామాజిక భవనం నిర్మాణానికి స్థలం కోసం ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. అనంతరం స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో తాగునీటి పథకం ట్యాంకు నిర్మిస్తామన్నారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, పీఆర్ ఏఈ రవితేజ, సర్పంచ్ టి.ఆదిరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం

రాజవొమ్మంగి సచివాలయం పరిధిలో స్థానికులు తెలిపిన డ్రైనేజీ సమస్యను నాలుగు రోజుల్లో పరిష్కరిస్తానని ఎంపీడీవో బాపన్నదొర చెప్పారు. ఈ మేరకు ఆయన పలు వీధుల్లో పర్యటించారు. వారపు సంత వద్ద పేరుకుపోయిన చెత్త తొలగించాలని పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావును ఆదేశించారు. పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు తదితరులున్నారు.

సర్పంచ్ చొరవతో బోరుకు మరమ్మతులు



బోరు మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ అభిరామ్

కూనవరం: చినార్కూరు పంచాయతీ వెంకన్నగూడెం గ్రామంలోని బోరు కొద్ది రోజులుగా పాడైంది. దీంతో పాటు బోరు నుంచి మురుకినీరు వస్తోండడంతో తాగునీటి కోసం స్థానికులు ఇబ్బందులు పడ్డారు. సమస్యను స్థానికులు సర్పంచ్ సున్నం అభిరామ్‌కు విన్నవించారు. ఆయన స్పందించి విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు చేతి బోరు మరమ్మతుకు చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ అభిరామ్ మట్లాడుతూ బోరు మరమ్మతు చేపట్టి, స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నట్టు చెప్పారు.

కార్యదర్శి శివ మణికంఠ, ఇంజినీరింగ్ అధికారి శివ శంకర్ తదితరులు పర్యవేక్షించారు. గ్రామస్తులు కన్నమ్మ, సూరిబాబు, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ తదితరులు



గంగవరంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, సర్పంచ్

అడ్డతీగల: ప్రభుత్వం ప్రోత్సాహంగా అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అడ్డతీగల ఎంపీపీ బొడ్డపాటి రాఘవ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు విద్యాశాఖ ద్వారా అందుబాటులోకి వచ్చిన స్టడీ మెటీరియల్‌ను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉన్నతమైన విద్యా ప్రమాణాలు అందుబాటులోనికి తీసుకురావాలని ఆర్థిక భారమైనప్పటికీ ప్రభుత్వం ఆయా విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఉత్తీర్ణతలో గణనీయమైన ఫలితాలు సాధించాలన్నారు. అడ్డతీగల మండలంలోని 10 ఉన్నత పాఠశాలల్లో అభ్యసిస్తున్న 383 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్నామన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కారు రాంబాబు, విద్యా కమిటీ చైర్మన్ కాసులమ్మ, ఎంపీటీసీ నక్కా ఈశ్వరి, నాయకుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగనన్న విశేష కృషి

గంగవరం : విద్యాభివృద్ధికి సీఎం జగనన్న ఎంతో కృషి చేస్తున్నారని విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి అభ్యసిస్తున్న 104 మంది విద్యార్థులకు జగనన్న విద్యా భారతి స్టడీ మెటీరియల్‌ను వారు అందజేశారు. ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, సర్పంచ్ కలుముల అక్కమ్మ , హెచ్‌ఎంలు ఝాన్సీ హేన్సన్, ఆర్.వి.వి.సత్యనారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి



హుకుంపేటలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాజుబాబు, నేతలు



అడ్డతీగలలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీసీసీ కార్యదర్శి సత్తిబాబు తదితరులు

రంపచోడవరం: జిల్లా వ్యాప్తంగా మహాత్మా గాంధీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అహింసావాదంతో ఎంతటి కఠిన లక్ష్యమైనా చేధించవచ్చని నిరూపించి బ్రిటీష్ పాలకుల చెర నుంచి అఖండ భారతావనికి విముక్తి కలిగించి దేశం కోసం ప్రాణాలు విడిచిన మహానేత గాంధీజీ అన్నారు. మహాత్ముని త్యాగాలు మరువలేనివన్నారు. జాతిపిత గాంధీజీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వాడవాడలా జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తామరపల్లి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ కుంజం వంశీ , సర్పంచ్ ఎం.ఆనంద్ రెడ్డి, వార్డ్ మెంబర్ల ప్రసాద్,చిట్టిదొర, నాయకులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు భీమలింగేశ్వరరావు, వెంకట్, పార్టీ యువజన విభాగ జిల్లా కార్యదర్శి రమేష్, సీఆర్పీ రత్నం, నాయకులు జానకి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: వివిధ ప్రాంతాల్లో జరిగిన గాంధీ వర్ధంతి కార్యక్రమాల్లో సర్పంచ్‌లు అక్కమ్మ, కామరాజు, శివదొర, రాజమ్మ , మరిడమ్మ, లీలావతి, రమణమ్మ, లక్ష్మి, రామలక్ష్మి, గ్రామ కార్యదర్శులు అజయ్, కృష్ణస్వామి, గణేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీఎం ఆదినారాయణ, నాయకుడు వెంకటేష్‌రాజు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో గాంధీజి చిత్రపటం వద్ద గ్రామస్తుల నివాళి



తామరపల్లిలో మహాత్ముని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సచివాలయం సిబ్బంది

నేడు సూరంపాలెంలో 'గడప గడపకు'

గంగవరం : నేడు సూరంపాలెం పంచాయతీ పరిధిలోని సూరంపాలెం, రాజుపేటలొద్ది, వేమనాపల్లి, దోనెలపల్లి గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో గల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

పరిహారం అందజేయాలని వినతి

ఎటపాక: గతేడాది వచ్చిన గోదావరి వరదల కారణంగా ముంపునకు గురైన తమను ఆదుకొని న్యాయం చేయాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావుకు గౌరీదేవిపేట, నందిగామ గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలు సోమవారం వినతిపత్రం అందజేశారు. కొందరికి పరిహారం అందించి, మరికొందరికి విస్మరిస్తున్నారని, అందరికీ పరిహారం అందేలా చూడాలని కోరారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



గంగవరం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు



కొయ్యూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, విద్యార్థులు

కొయ్యూరు: మండల కేంద్రంలో రాజేంద్రపాలెం వైద్యుడు సంపత్‌బాబు ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై సర్వే చేస్తున్నామన్నారు. లెప్రసీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీహెచ్‌వో ప్రశాంత్, హెచ్‌వీ లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మోహన్ ఆధ్వర్యంలో కుష్టువ్యాధిపై విద్యార్థులు అవగాహన కల్పించారు.

గంగవరం: మండల కేంద్రంలో వైద్యాధికారి భావన ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో, పిడతమామిడి వైద్యాధికారి సాయి రతన్ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సూరంపాలెం, కొత్తాడ, సర్పంచ్‌లు శివదొర, కామరాజు, వైద్యులు కెవిన్, హెచ్‌ఎం సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'లోకేష్ పాదయాత్రతో ఒరిగేది లేదు'



మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, నేతలు

కొయ్యూరు: నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్రతో ఒరిగేది లేదని ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ చెప్పారు. రాజేంద్రపాలెంలోని జెడ్పీ అతిథి గృహంలో వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్రలో లోకేశ్ మాటలు, వ్యవహార శైలిని చూసి ప్రజలతో పాటు టీడీపీ నాయకులు సైతం సిగ్గుపడుతున్నారన్నారు. లోకేష్ తీరుపై టీడీపీ నేతలు సైతం విసుగెత్తిపోతున్నారన్నారు.మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, పార్టీ కన్వీనర్ సుధాకర్, ఎంపీటీసీ బిడిజన అప్పారావు, సర్పంచ్‌లు సోమన్నదొర, రాజకుమారి, పోతురాజు, నాయకులు సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటన రేపు

రంపచోడవరం: రంపచోడవరం మండలంలోని పలు గ్రామల్లో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి బుధవారం పర్యటించనున్నట్టు పార్టీ వర్గీయులు ప్రకటనలో తెలిపారు. పెదగెద్దాడలో క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలోని వాటర్ ప్లాంట్‌ను, సీతపల్లి గ్రామంలో పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. మధ్యాహ్నం 12 నుంచి తామరపల్లి పంచాయతీలో బూరుగుబంద, కన్నారం, నూనెపల్లి, తామరపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

గృహ సారథుల జాబితా ఎమ్మెల్యేకు అందజేత



ఎమ్మెల్యే పాల్గుణకు జాబితా అందజేస్తున్న నేతలు

పెదబయలు: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 23 పంచాయతీల్లో 530 మంది గృహ సారథులను ఎంపిక చేసినట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఆనందరావు చెప్పారు. ఆయా వివరాలను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు అందజేసినట్టు చెప్పారు. అజయ్‌కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో 478 మందిని గృహసారథుల నియమకాల ప్రక్రియ పూర్తి చేసినట్టు మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ చెప్పారు. ఆయా వివరాల జాబితాను ఎమ్మెల్యే పాల్గుణకు అందజేశామన్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు



తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాజవొమ్మంగి/ వీఆర్ పురం: రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రాజవొమ్మంగి, వీఆర్ పురం మండల కేంద్రాల్లో సోమ వారం నాయకులు కిరణ్, రామారావు సత్యనారాయణ మాట్లాడుతూ ధాన్యం గిట్టుబాటు ధరలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు రమేష్, ఎంపీపీ లక్ష్మీ, ఎంపీటీసీ ప్రదీప్, సర్పంచ్ సంతోష్ పాల్గొన్నారు. వీర్ పురంలో తహసీల్దార్ శ్రీధర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయులను నియమించాలి

రాజవొమ్మంగి: మండలంలోని లబ్బర్తి ఎంపీపీ పాఠశాలకు సబ్జెక్టు టీచర్లను వెంటనే నియమించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు సోమవారం పాఠశాల వద్ద ఆందోళనకు చేశారు. ఈ పాఠశాలలో గతంలో ఏడుగురు టీచర్లు పనిచేసేవారని, ప్రస్తుతం ఇక్కడ నుంచి ముగ్గురిని ఇతర పాఠశాలలకు బదిలీ చేశారన్నారు. ఈ పాఠశాలను పక్క గ్రామంలోని లాగరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేయవద్దన్నారు. కాగా లబ్బర్తి ఎంపీపీ పాఠశాలలో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 92 మంది పిల్లలు చదువుతున్నారని, 1, 2 తరగతులు తప్ప మిగతా తరగతులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలీనం చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని కోరారు.